

హంగర్గను చుట్టుముట్టిన వరద 2





చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్ 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




నిజామాబాద్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మను పేర్చారు. అనంతరం స్టేషన్ ఆవరణలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో సీఐ సురేశ్, ఎస్సైలు ఆరీఫ్, యాదిగిరిగౌడ్, సుష్మిత పాల్గొన్నారు.





## నిజాంసాగర్‌కు భారీ వరద..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిజాంసాగర్‌కు వరద పోటెత్తుతోంది. అలాగే ఎగువన సింగూరు, పోచారం ప్రాజెక్ట్‌ల నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో అధికారులు 19 గేట్ల ద్వారా 1,40,236 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి వదులుతున్నారు. జలాశయంలోకి ఎగువ నుంచి 1,30,269 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1401.61 అడుగుల (13.123 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఆయకట్టు కోసం ప్రధాన కాలువకు 900 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన గల సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండడంతో గేట్లను ఎత్తి 96,604 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 90,000 ఇన్‌ఫ్లో వస్తుండడంతో దిగువకు వదులుతున్నారు.




## శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు పోటెత్తిన వరద..

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం 2.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 39 వరద గేట్లు ఎత్తి 3,44,575 క్యూసెక్కుల నీటికి దిగువకు వదులున్నారు. దీంతో జలాశయం నీటిమట్టం తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌కు 2.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మొత్తం 3,54,338 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం.. 1085.2 (60.1 టీఎంసీలు) అడుగుల నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్లతో పాటు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రకటించింది. ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ పదవుల కోసం రిజర్వేషన్లు ఖరారు చేసింది. దీంతో ప్రధాన పార్టీలు ఉమ్మడి జిల్లాలో ని రెండు జెడ్పీ పీఠాలను కైవసం చేసుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తున్నాయి. ఆయా సామాజిక వర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం నాయకులు ఆరా తీస్తున్నారు. త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండడంతో ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీకి సిద్ధమవుతున్నారు.

\- అక్షరటుడే, కామారెడ్డి



# స్థానిక పోరుకు సన్నద్ధం..!

### నోటిఫికేషన్ కోసం వెయిటింగ్

స్థానిక ఎన్నికల కోసం ప్రజలు ఏడాదిన్నరగా నిరీక్షిస్తున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో గ్రామాల్లో పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆశావహులతో పాటు ప్రజలు సైతం ఎన్నికలు ఎప్పుడు పెడతారా అని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆశావహులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారా అని చర్చించుకుంటున్నారు. కాగా త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.

- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- ఎలాగైనా గెలుచుకోవాలని పార్టీల ప్రణాళికలు
- బలమైన అభ్యర్థుల కోసం నాయకుల ఆరా
- జిల్లా పరిషత్ పీఠంపైనా ఫోకస్

ఉమ్మడి జిల్లాలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు రంగంలోకి దిగారు. రిజర్వేషన్ల ప్రక్రియ లాటరీ పద్ధతి మొదలయినప్పటి నుంచి తాము అనుకున్న స్థానాల్లో రిజర్వేషన్ రాగానే ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. వెంటనే తమ అనుచరులను రంగంలోకి దింపారు. ఇక నాయకుల ద్వారా సమ్మతి తీసుకుని నేరుగా పోటీకి సిద్ధం కావడానికి రెడీ అవుతున్నారు.

### బలమైన అభ్యర్థుల కోసం వేట

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు జెడ్పీటీసీ ఎన్నికలకు బలమైన అభ్యర్థుల కోసం ఆరా తీస్తున్నాయి. రిజర్వేషన్ ప్రకారం ఎవరికి టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయో లెక్కలు వేసే పనిలో ఆయా పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. టికెట్ ఇచ్చాక అభ్యర్థి మార్పు ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు టికెట్ రాలేదని అలిగే నాయకులను బుజ్జగించడానికి కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. మెజారిటీ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలపై గురి అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు స్థానిక ఎన్నికలు రెఫరెండంగా మారనున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు బాధ్యత కూడా ఎమ్మెల్యేల భుజాలపై వేసే అవకాశాలు ఉన్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో తమ నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ ఎన్నికలను సీరియస్ గా తీసుకుని భవిష్యత్తుకు పునాది వేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

### రిజర్వేషన్లు ఇలా

ఉమ్మడి జిల్లాలో జెడ్పీటీసీ స్థానాల్లో రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 31 మండలాలలో ఎస్టీ మూడు, ఎస్సీ ఐదు, జనరల్ 10, బీసీ అభ్యర్థులకు 13 కేటాయించారు. కామారెడ్డి జిల్లాలో 25 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా.. బీసీ 11, జనరల్ ఎనిమిది, ఎస్సీ నాలుగు, ఎస్టీ రెండు కేటాయించారు.

### పీఠం దక్కించుకోవాలని..

ఉమ్మడి జిల్లాలో రెండు జెడ్పీ స్థానాలపై ప్రధాన పార్టీల నాయకులు ఫోకస్ పెంచారు. నిజామాబాద్ జెడ్పీ స్థానం బీసీ మహిళకు, కామారెడ్డి జెడ్పీ స్థానం జనరల్‌కు రిజర్వ్ అయ్యాయి. నిజామాబాద్‌లో మాక్లూర్, మోర్తాడ్, మెండోరా, ఏర్గట్ల, మోస్రా, కోటగిరి మండలాల జెడ్పీటీసీ స్థానాలు బీసీ మహిళలకు రిజర్వ్ అయ్యాయి. దీంతో ఆ మండలాల జెడ్పీటీసీల్లో ఒకరు జెడ్పీ ఛైర్‌పర్సన్ కానున్నారు. ఈ క్రమంలో ఆ స్థానంలో ఎవరిని బరిలోకి దింపాలని పార్టీలో యోచిస్తున్నారు. బలమైన నేతల కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. కాగా కొంత మంది ఆశావహులు తమకు అనుకూలంగా రిజర్వేషన్ రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ కోసం కొందరు ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేశారు. అయితే తీరా రిజర్వేషన్ అనుకూలంగా రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 60ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో గౌడ కులస్థులందరూ కలిసి ఏకతాటిపైకి వచ్చి ఆలయ పునర్నిర్మాణం చేయిస్తుండడంపై ఆయన అభినందించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆలయం ఎదుట డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీకి కానుకగా ఇవ్వాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, మాజీ ఎంపీటీసీ చింతల కిషన్, గౌడ సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వదేశీ వస్తువులను ఉపయోగిద్దాం

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

**అక్షరటుడే, ఇందూరు:** ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం సుభాష్‌నగర్‌లో గల క్యాంప్ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి గొప్ప సందేశంతో పాటు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారన్నారు. దేశ ప్రజలంతా స్వదేశీ వస్తువులను ఉపయోగిస్తూ.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం మేడిన్ ఇండియా, మేకింగ్ ఇండియా నినాదంతో దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ మహిళలు సైతం చిన్నచిన్న కుటీర పరిశ్రమలతో అభివృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘ్ సేవలను గుర్తుచేయడం జరిగిందని పేర్కొన్నారు. అయోధ్య రామ మందిరం నిర్మాణంతో హిందువుల చిరకాల స్వప్నం నెరవేరిందని గుర్తు చేశారన్నారు. దేవీ నవరాత్రులు, దీపావళి కానుకగా దేశ ప్రజలకు గొప్ప బహుమతిగా జీఎస్టీ తగ్గింపులు చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరలు లేనట్టేనా..!

- రేపే సద్దుల బతుకమ్మ
- ఇప్పటికీ అందని 'రేవంతన్న కానుక'
- మహిళల అసంతృప్తి

**తెలంగాణ సంస్కృతి.. సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఉత్సాహంగా జరుపుకుంటారు. పండుగ సందర్భంగా కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో దీనిని ప్రారంభించారు. అయితే ఈ ఏడాది మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. రేవంతన్న కానుక పేరిట ఒక్కో మహిళకు రెండు చీరలు ఇస్తామని పేర్కొంది. కానీ పండుగ పూర్తి కావడానికి వచ్చిన జిల్లాలో ఎక్కడ కూడా చీరలు అందలేదు.**

–అక్షరటుడే, ఇందూరు



ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది చీరలు పంపిణీ చేయలేదు. ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అక్కాచెల్లెళ్లకు.. రేవంతన్న కానుక పేరుతో చీరలను పంపిణీ చేస్తామని ప్రకటించింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు మాత్రమే అందజేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

### రేపే బతుకమ్మ పండుగ

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3.98 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇందులో నిజామాబాద్‌లో 2.19 లక్షలు కాగా, కామారెడ్డిలో 1.79 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఇదిలా ఉండగా సద్దుల బతుకమ్మను కొన్ని ప్రాంతాల్లో సోమవారం, మరికొన్ని చోట్ల మంగళవారం నిర్వహించనున్నారు. బతుకమ్మ పండుగ అయిపోతున్న చీరలు పంపిణీ చేయకపోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### ఎప్పుడు పంపిణీ చేస్తారు

బతుకమ్మ చీరల పంపిణీ ఉమ్మడి జిల్లా మహిళల్లో చర్చనీయాంశమైంది. సాధారణ మహిళలకు చీరలను అందజేయడం లేదని తెలవడంతో గతంలో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే పండుగ సమీపిస్తున్న చీరలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైక ప్రకటన రాకపోవడం, జిల్లాకు చీరలు చేరకపోవడంతో ఈ సారి చీరలు పంపిణీ చేస్తారా లేదా అని మహిళలు చర్చించుకుంటున్నారు. ఇంకా ఎప్పుడు పంపిణీ చేస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



## ఉమ్మడిజిల్లాలో కిక్కిరిసిన పూల మార్కెట్లు

**అక్షరటుడే ఇందూరు/కామారెడ్డి:** బతుకమ్మ సంబరాలకు ఉమ్మడిజిల్లా సిద్ధమైంది. ఈ సందర్భంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పూల మార్కెట్లు సందడిగా మారాయి. కామారెడ్డి డెయిలీ మార్కెట్ ఆదివారం పూల క్రయ విక్రయదారులతో సందడి నెలకొంది. సద్దుల బతుకమ్మ సంబరాన్ని సోమవారం నిర్వహించనుండడంతో గునుగు, తంగెడు, బంతి పూలు కొనుగోలు చేస్తున్నారు. పూల ధరలు కూడా అమాంతం పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గునుగు పువ్వు ధర ఆకాశాన్నంటింది. బంతిపూలు మామూలు రోజుల్లో కిలో ధర రూ.80 నుంచి 100 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200 వరకు ఉంది.



## గొర్రెల మందపై చిరుత దాడి..

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలంలో చిరుత కలకలం సృష్టించింది. గొర్రెల మందపై దాడిచేసింది. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామంలో గౌరారం అటవీ శివారులోకి గొర్ల కాపర్లు గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. అయితే మందపై శనివారం సాయంత్రం చిరుత ఒక్కసారిగా దాడిచేసింది. ఓ గొర్రెను చంపేసిందని బాధితుడు కురుమ సంతోష్ తెలిపాడు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న రేంజ్ అటవీశాఖ అధికారులు ఆదివారం సంఘటనాస్థలానికి చేరుకున్నారు. చిరుత ఆనవాళ్లను తెలుసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించారు. ఈ విషయమై ఎఫ్ఆర్‌వో హేమచందనను వివరణ కోరగా చిరుత దాడి వాస్తవమేనన్నారు. అటవీ ప్రాంతంలో చిరుతలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. బాధితుడికి నష్టపరిహారం అందేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు అక్బర్, సాయిలు, మల్లేష్ పాల్గొన్నారు.















# ఇందూరుకు ప్రత్యేకం.. అష్టాదశ శక్తిపీఠాల దర్శనం..

దుబ్బలోని గౌతంనగర్ భవాని శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అష్టాదశ శక్తి పీఠాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని శక్తిపీఠాలన్నింటిని ఒక్కచోట చేర్చి భక్తులు దర్శనం చేసుకునే విధంగా మండప నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో దుర్గామాత మండపాన్ని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు.

– ఫొటోగ్రాఫర్, నిజామాబాద్























## భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ చట్టం తేవాలి




**అక్షర టుడే, నిజామబాద్ సిటీ:** నగరంలోని భగత్ సింగ్ చౌరస్తాలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భగత్ సింగ్ ఆలోచనలు, త్యాగాలు నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. సమానత్వం, శోషణ నిర్మూలన, విద్య, ఉద్యోగ హక్కుల కోసం భగత్ సింగ్ పోరాటం నేటి తరానికి ప్రేరణనిస్తోందన్నారు. నేటి విద్యార్థి సమస్యలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, ఫీజుల పెంపు, కాంట్రాక్టు విధానాలు భగత్ సింగ్ కలలు కన్న సమాజానికి విరుద్ధమన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో పోరాట స్ఫూర్తి పెంపొందించాలని, సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, జిల్లా నాయకులు నవీన్ కృష్ణ, నితిన్, రమేష్, మదు, జిల్లా కార్యదర్శి రంజిత్, ఫిరోజ్ ఆలీ, ఇమ్రాన్ ఆలీ పాల్గొన్నారు.

## అయ్యప్ప గర్భ గుడి ప్రారంభోత్సవం




**అక్షరటుడే, ఆర్మూర్ :** నందిపేట్ మండలం పలుగుట్టలో మంగి రాములు మహారాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయ గర్భగుడి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలుగుట్టలో కంటి చికిత్స కోసం వచ్చిన వారితో ముచ్చటించి వారి బాగోగులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, సిలిండర్ లింగం, బైండ్ల ప్రశాంత్, అశోక్ ముల్లంగి ,శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పిప్రి వీరేశంకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది. ఈ మేరకు ఆదివారం ఏఎంసీ మాజీ ఛైర్మన్ యమాద్రి భాస్కర్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కర్ణ కృష్ణ గౌడ్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.




## జల్సాలకు అలవాటు పడి చోరీలు.. ఇద్దరి అరెస్ట్


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 31 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తన కార్యాలయంలో ఆదివారం వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన షేక్ సల్మాన్, మరాటి ఆకాష్ రావు, షేక్ సాదక్, వినోద్, రమేష్ చవాన్, ముక్తే సాయినాథ్ ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. జల్సాలకు డబ్బులు సరిపోవడం లేదని దొంగతనాలు చేయడం ప్రారంభించారు. షేక్ సాదక్ ముఠాకు లీడర్‌గా ఉంటూ నడిపిస్తున్నాడు. తాళం వేసిన ఇళ్లను రెక్కీ చేసి వీరు చోరీలకు పాల్పడుతున్నారు. నగరంలోని నాగారం బ్రాహ్మణ కాలనీకి చెందిన వేలేటి పవన్ శర్మ ఇంట్లో చోరీ జరిగింది. 33 తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.30 వేల నగదు దొంగతనం జరిగిందని ఆయన ఈ నెల 23న ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం నాగారం డబుల్ బెడ్ రూం చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ముఠా సభ్యులు షేక్ సల్మాన్, మరాఠీ ఆకాశరావులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి 31 తులాల బంగారం ఆభరణాలు, ఆటో, మొబైల్ ఫోన్ స్వాధీం చేసుకున్నారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ ఈ కేసును ఛేదించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు.

## కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


**అక్షరటుడే, కోటగిరి :** కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన పోతంగల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లిఖిత్ చంద్ర(4) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. కాలనీవాసులు గమనించి కుక్కలను తరిమేశారు. దీంతో ప్రమాదం తప్పింది. గాయపడ్డ బాలుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒంటరిగా వెళ్తున్న వారిపై కుక్కలు దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. గుంపులుగా తిరుగుతుండటంతో పెద్దలు సైతం వాటిని చూస్తే భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రెయినేజీలో పడిన దూడను కాపాడిన హోంగార్డ్

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ నగరంలో డ్రెయినేజీలో పడిన ఓ దూడను ట్రాఫిక్ హోంగార్డు కాపాడారు. వీక్లీ మార్కెట్లో డ్రెయినేజీలో లేగ దూడ పడిపోయింది. గమనించిన స్థానికులు ట్రాఫిక్ హోంగార్డు జీవన్ సింగ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన స్థానికుల సాయంతో దానిని కాపాడారు. తాళ్ల సాయంతో డ్రెయినేజీ నుంచి బయటకు తీశారు. జీవన్ సింగ్‌ను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అభినందించారు.



## నగరంలో తాళం వేసిన ఇంట్లో చోరీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేస్తున్నారు. ఐదో పోలీస్ స్టేషన్ పరిధిలోని మమ్మదీయ కాలనీలో దుండగులు ఇంట్లోకి చొరబడి నగలు అపహరించుకుపోయారు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహమ్మద్ షకీర్ కుటుంబం మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. ఇల్లంతా గందరగోళంగా ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఐదో టౌన్ ఎస్‌హెచ్ఓ గంగాధర్ చోరీ జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఒకటిన్నర తులాల బంగారం కనబడడం లేదని ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముప్కాల్ మండల గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో గౌరవాధ్యక్షుడు కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బత్తిని రాజేశ్వర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా సదానంద గౌడ్, కార్యదర్శిగా సంతోష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే యువజన సంఘం అధ్యక్షుడిగా సంతోష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రంజిత్ గౌడ్, కార్యదర్శిగా దశరథ్ ఎన్నికవగా.. బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తానని, సంఘ బలోపేతానికి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో దేవేందర్ గౌడ్, రాగిరి గౌడ్, నారాగౌడ్, దేవరాజ్ గౌడ్, ఫణీంద్ర గౌడ్, నారాయణ గౌడ్, వెంక గౌడ్, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.



## పౌల్ట్రీ సప్లయర్ ఇంటిముందు రైతుల ఆందోళన

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతుల నుంచి కోళ్లు తెచ్చుకుని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఓ పౌల్ట్రీ సప్లయర్ ఇంటి వద్ద బాధిత రైతులు ఆందోళనకు దిగారు. తాము విక్రయించిన కోళ్లకు సంబంధించిన డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 20 మందికి రూ.34 లక్షలు ఇవ్వాల్సి ఉందని సాజిత్ అనే బాధితుడి తెలిపాడు. వెంటనే తమ డబ్బులు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు.




# హంగర్గ గ్రామాన్ని చుట్టుముట్టిన వరద..

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మండలం హంగార్గా గ్రామాన్ని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ చుట్టు ముట్టింది. గ్రామం ముంపునకు గురికావడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. దీంతో బోధన్ తహశీల్దార్ విఠల్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామానికి చేరుకొని ప్రజలను తరలించారు. గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతాలకు పంపించారు. వరద పెరిగినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.